సాక్షి
వికారాబాద్
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



రైతులకు పరిహారమివ్వాలి

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. 8లో▸



భూ వివాదం.. ఉద్రిక్తం

భూ వివాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. 8లో▸



పారిశుద్ధ్యంపై అవగాహన

తాండూరులో బుధవారం కౌన్సిలర్ వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 9లో▸

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి



పతకాలతో ముడావత్ సుభాష్

కొడంగల్ రూరల్: నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీలో నేటి (19వ తేదీ) నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పాత కొడంగల్ గిరిజన గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థి ముడావత్ సుభాష్ ఎంపికయ్యారు. హైదరాబాద్ వెళ్తున్న సుభాష్‌ను బుధవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి పతకం పొందాలని ఆకాంక్షించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సుభాష్ ఈ నెల 15న పరిగి పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 200, 400ల మీటర్ల పరుగు పందంలో తృతీయ స్థానంలో, 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించాడు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీదేవి

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి నియమితులయ్యారు. పూడూరు మండలంలో పని చేస్తున్న శ్రీదేవి తాండూరు మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో 57 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన వారు వెబ్‌సైట్ httpr://fmcvikarabad.orf/లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

27న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

అనంతగిరి: జిల్లా స్థాయి యువజనోత్సవాలరె ఈ నెల 27న నిర్వహించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి హన్మంత్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు అనంతగిరి గుట్టలోని హరిత రిసార్ట్స్‌లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న 15 నుంచి 29 సంవత్సరాలలోపు యువతి, యువకులు పాల్గొన వచ్చన్నారు. జానపద నృత్యం(బృందం), వ్యక్తిగత ప్రదర్శన, గీతం, కథ రచన, పెయింటింగ్, కవిత్వం, హస్తకళ, వస్త్రకళ, వ్యవసాయ ఉత్పత్తులు వంటి అంశాల్లో పోటీ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వాట్సాప్ నంబరు 9676638201లో సంప్రదించాలన్నారు.

క్రీడాకారుల ఎంపిక ప్రారంభం

తాండూరు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, -17 విభాగాల్లో పలు క్రీడాంశాల్లో బుధవారం నుంచి క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. తాండూరు జోన్ పరిధిలో తొలిరోజు అండర్-17 విభాగంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీ అంబదాస్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఈ ఎంపిక ప్రక్రియ 27వ తేదీన ముగుస్తుందన్నారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, పరుగు పందెం, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో వంటి క్రీడల్లో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు అనంతయ్య, అంబదాస్, రాజశేఖర్ రెడ్డి, రాజు, శివ, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో వెలసిన శ్రీ పాంబండ రామలింగేశ్వర ఆలయంలో బుధవారం గిరి ప్రదక్షిణ నేత్రపర్వంగా సాగింది. భక్తులు ఆలయ ముఖద్వారం నుంచి క్షేత్రం చుట్టూ పాదయాత్రగా ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

పంట రుణాలు అరకొరే!



రుణ లక్ష్యంలో సగం కూడా చేరుకోని బ్యాంకర్లు

- ఇంకా అందని రైతు భరోసా సాయం
- సీజన్ ప్రారంభమై మూడు నెలలు దాటినా తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో ఈ ఏడాది పంట రుణాల లక్ష్యం రూ.3,434 కోట్లు
- అందాల్సిన సాగు సాయం రూ.320 కోట్లు
- బ్యాంకుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు

వికారాబాద్: పంట రుణమూ లేదు.. రైతుబంధు అందదు.. ఇదీ ఈ ఏడాది జిల్లా రైతుల పరిస్థితి.. రైతులకు సాగు పెట్టుబడి ఆధారమైన పంట రుణాల ప్రక్రియ ఈ ఏడాది నత్తనడకన సాగుతోంది. వానాకాలం సీజన్ ప్రారంభమై మూడు నెలలు దాటినా బ్యాంకర్లు రుణ లక్ష్యంలో యాభై శాతం కూడా చేరుకోవడంలేదు. ప్రభుత్వం ఎకరాకు రూ.15వేల చొప్పున ఇచ్చే రైతు భరోసా సాయం కూడా ఇంకా అందలేదు. దీంతో పంట పెట్టుబడి కోసం అన్నదాతలు వడ్డీ వ్యాపారులు, షావుకారుల గడప తొక్కక తప్పడం లేదు. రుణాల కోసం బ్యాంకర్లు రైతులను నెలల తరబడి తిప్పుకుంటున్నారు. పంట రకాలను బట్టి ఒక్కో ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. బ్యాంకర్లు, ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో రైతులు ఎరువులు, విత్తనాల కొనుగోలు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రుణ ప్రణాళిక ఆలస్యంగా విడుదల చేసిన బ్యాంకర్లు రుణాలు ఇచ్చే విషయంలోనూ అదే జాప్యం చేస్తున్నారు.

రుణ లక్ష్యం రూ.3,434కోట్లు

సాధారణంగా ప్రతి ఏటా వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే బ్యాంకర్లు జిల్లాలో ఎంత మంది రైతులు ఉన్నారు..? ఎన్ని ఎకరాల సాగు భూమి ఉంది..? ఇవ్వాల్సిన రుణాలు ఎన్ని అనే దానిపై రుణ ప్రణాళిక సిద్ధం చేస్తారు. ఈ ఏడాది కూడా రుణ ప్రణాళిక విడుదల చేసిన బ్యాంకర్లు పంట రుణాలు ఇచ్చే విషయంలో రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారు. జిల్లాలో 2.40 లక్షల మంది రైతులు ఉండగా వారికి ఈ ఏడాది రూ.3,434 కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాగు పనులు ప్రారంభమై మూడున్నర మాసాలు కావస్తున్నా బ్యాంకర్లు మాత్రం పెట్టుకున్న రుణ లక్ష్యంలో సగం కూడా ఇవ్వలేదు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో కలిపి కేవలం రూ.850 కోట్ల పంట రుణాలు మాత్రమే ఇచ్చారు. రుణాలిచ్చే ప్రక్రియ రెగ్యులర్ అయినా నో డ్యూస్ సర్టిఫికెట్ పేరుతో తిప్పుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో చెక్ చేసుకుంటే సరిపోయే దానికి సర్టిఫికెట్ అడగడం సరికాదని రైతులు అంటున్నారు.

5.90 లక్షల ఎకరాల్లో..

ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5.90లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పంట రకాలను బట్టి ఒక్కో ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏటా ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, డీసీసీబీ తదితర బ్యాంకులు రూ.3,434 కోట్ల వ్యవసాయ రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నాయి. దీంతో పాటు ప్రభుత్వం 2.40లక్షల మంది రైతులకు రైతు భరోసా పథకం కింద రూ.320 కోట్లు ఇవ్వాల్సి ఉంది. సాగు సాయం నేటికీ అందలేదు. దీంతో రైతులు పంట పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.



కొడంగల్: సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ఓటరు జాబితాకు సహకరించండి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

అనంతగిరి: ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. ఈ నెల 13న జీపీల్లో ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందన్నారు. 21వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. మార్పులు, చేర్పులు ఉంటే ఈ నెల 19న జరిగే మండల స్థాయి సమావేశంలో చెప్పాలన్నారు. 26న అభ్యంతరాలు, సూచనలను పరిగణలోనికి తీసుకొని 28న తుది జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. గ్రామాల్లో నివాసం లేనివారు, వివాహం చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు సహకరించాలని నాయకులను కోరారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీపీఓ సంధ్యారాణి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, మహిపాల్, ప్రసాద్, మల్లేశం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సవరించండి

కొడంగల్: ఓటరు జాబితాలో తప్పులు సవరించుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటరు జాబితా సవరణపై దృష్టి సారించాలన్నారు. జాబితాలో మార్పులు చేర్పుల కోసం అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. ఈ విషయంలో అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఓటు హక్కు వినియోగించుకోవడానికి తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. అనంతరం లింగ్యా నాయక్ పట్టణంలోని బాలాజీనగర్‌లో పర్యటించారు. ఇంటింటి సర్వేను పరిశీలించారు. బీఎల్‌ఓ అన్నపూర్ణతో కలిసి ఓటరు లిస్టులో సవరణల గురించి ప్రజలకు వివరించారు. తప్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పట్టణంలోని వడ్డర్ గల్లీలో ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. బీఎల్‌ఓ ఆనందమ్మతో కలిసి ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

మెరుగైన వైద్యం అందాలి

- తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్
- ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల సందర్శన

తాండూరు టౌన్: రోగులకు మెరుగైన వైద్యం అందాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అందుబాటులో ఉన్న మందులు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. ఆయా విభాగాధిపతులను అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చేది పేదలేనని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందేలా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్, వైద్యులకు సూచించారు. అనంతరం జిల్లా ఆస్పత్రి అనుబంధ విభాగమైన పీపీ యూనిట్‌లో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సందర్శించారు. అక్కడి హాస్టల్‌లో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ప్రిన్సిపాల్ విజయారాణిని అడిగి తెలుసుకున్నారు. కళాశాల, హాస్టల్‌లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే ఉన్నతాధికారులకు వివరించి పరిష్కరిస్తామని తెలిపారు.

త్వరలో తులం బంగారం

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు తీపికబురు
- అన్ని పథకాల అమలుకు ప్రభుత్వం కార్యాచరణ
- బీఆర్‌ఎస్ నేతలు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- లబ్ధిదారులకు చెక్కులు అందజేత



మహిళకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు త్వరలో తులం బంగారం ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం ధారూరు రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ఉద్యోగులకు జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా చేశారని అన్నారు. దీంతో ఆరు గ్యారంటీల అమలులో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమే అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండు నెలల్లో అన్నింటిని అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో కొన్ని తప్పులు చోటుచేసుకుందున వాటిని సరిదిద్దే పనిలో అధికారులు ఉన్నారని వివరించారు. అర్హులైన వారికి రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తామన్నారు. వివరాలు సరిగ్గా ఉన్న రైతులందరికీ రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రూ.2 లక్షల పైన ఉన్న పంట రుణాలను మాఫీ చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, మరో 4.82 లక్షల మందికి మాఫీ కావల్సి ఉందని పేర్కొన్నారు. రుణమాఫీ కాని వారు అధైర్య పడరాదని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, తెల్ల రేషన్ కార్డుల జారీ కోసం ఈ నెలాఖరు వరకు కార్యాచరణ ప్రారంభిస్తామని అన్నారు.

బీఆర్‌ఎస్‌వి పచ్చి అబద్ధాలు

మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పూటకో పచ్చి అబద్ధం మాట్లాడుతున్నారని ఆరోపించారు. పదేళ్ల అధికారంలో ఉండి చేయలేని వారు ఇప్పుడేం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పేదల సంక్షేమానికి పాటుపడే పార్టీ అని అన్నారు. భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 16,500ల చొప్పున వారి ఖాతాల్లో జమ చేయడం జరిదిందని గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్క రోడ్డు బాగుచేయలేదని విమర్శించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను త్వరలో బాగుచేయిస్తామని అన్నారు. దాత సోమిరెడ్డి ఎబ్బనూరు గేటు వద్ద నిర్మించిన బస్ షెల్టర్‌ను స్పీకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు, నాయకులు మహ్మద్ బాబాఖాన్, విజయభాస్కర్ రెడ్డి, రాములు, రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, హరిచంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ సూచించారు. బుధవారం కుల్కచర్లలో పరిగి జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం రైతు వేదికలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, ఎంఈఓ హబీబ్ అహ్మద్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, పీడీలు ఖాజా, ప్రవీణ్, పీఈటీలు కేశవులు, కృష్ణారెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మశాల స్థలాన్ని కాపాడండి

కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో ఉన్న ధర్మశాల స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు చూస్తున్నారని, ఆ భూమిని కాపాడాలని పలువురు నాయకులు ఎమ్మెల్యేని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో గ్రామ పంచాయతీ రికార్డుల్లో ధర్మశాలకు భూమి ఉండేదని, ప్రస్తుతం తప్పుడు పత్రాలు, సర్వే నంబర్లు చూపి కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే ధర్మశాల భూమి ఆక్రమణకు కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సెల్ టవర్ వద్దంటూ నిరసన

అబ్దుల్లాపూర్‌మెట్: ఇళ్ల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని కోరుతూ శివగంగ కాలనీ వెల్ఫేర్ అసోయేషన్ వాసులు ఆందోళన చేపట్టారు. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న శివగంగ కాలనీ వెల్ఫేర్ అసోయేషన్ వాసులు, స్థానిక సత్యం టెక్నో పాఠశాల విద్యార్థులు బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి యంజాల ప్రహ్లాద్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యలయానికి చేరుకున్నారు. పనులను నిలిపివేయాలని కోరుతూ కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాలను పాడుచేసే సెల్ టవర్ ఏర్పాటు పనులు తక్షణమే నిలిపివేయాలని లేదంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


పాత బస్తీకి కొత్త సొబగులు

ఓల్డ్‌సిటీపై జీహెచ్‌ఎంసీ ఫోకస్

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ పనులపై జీహెచ్‌ఎంసీ ఫోకస్ పెట్టింది. పాతబస్తీ పరిధిలోకొచ్చే చార్మినార్ జోన్‌లో ఇప్పటికే పలు మార్గాల్లో రహదారుల విస్తరణ, ఫ్లై ఓవర్లు, తదితర పనులు త్వరితంగా చేయాలంటూ సంబంధిత అధికారులను ఉన్నతాధికారులు ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. పనులు చేపట్టాల్సిన ప్రాంతాల్లో కమిషనర్ ఆమ్రపాలి క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి అక్కడి పరిస్థితుల్ని తెలుసుకున్నారు. ఇబ్బందులుంటే పరిష్కరించుకోవడంతో పాటు పనుల్ని త్వరితంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇది ఓవైపు దృశ్యంకాగా, మరోవైపు ఇప్పటికే ఉన్న ఫ్లై ఓవర్లను అందంగా కనిపించేలా థీమాటిక్ థీమ్స్‌తో సుందరంగా తీర్చిదిద్దేందుకు సిద్ధమయ్యారు. ఒవైసీ ఫ్లై ఓవర్, చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్, కందికల్‌గేట్, ఫలక్‌నుమా ఫ్లై ఓవర్లను చూడటానికి అందంగా ప్రత్యేకంగా తీర్చిదిద్దేందుకు టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు. అంచనా వ్యయం రూ.1.50 కోట్లు కాగా, దాదాపు ఆర్నెళ్లలో పనులు పూర్తికాగలవన్నారు. నగరం మొత్తం అందంగా కనిపించాలన్న ప్రభుత్వ నిర్ణయాని కనుగుణంగా అధికారులు ఈ పనులకు సిద్ధమైనట్లు సమాచారం. బెంగళూర్ నేషనల్ హైవే నుండి శాస్త్రిపురం జంక్షన్ వరకు, చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్ నుంచి బార్కాస్ రోడ్ వరకు, లక్కీ స్టార్ హోటల్ నుంచి హఫీజ్‌బాబానగర్ వరకు, బండ్లగూడ నుంచి ఎర్రకుంట వరకు, తదితర ప్రాంతాల్లో రోడ్ల విస్తరణలతో పాటు ఇతరత్రా ప్రాంతాల్లో పలు పనులకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు.

పోలీసులు మందు తాగలే!

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలు, ఫొటోలు



చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డికి బ్రీత్ అనలైజర్‌తో పరీక్ష చేస్తున్న దృశ్యం

పరిగి: బ్రీత్ అనలైజర్ మిషన్లు పట్టుకుని డ్రంక్ డ్రైవ్ నిర్వహించే పోలీసులను తరచూ చూస్తూనే ఉంటాం.. కానీ యూనిఫాం వేసుకుని, విధుల్లో ఉన్న పోలీసులకు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించడం చాలా అరుదు. సరిగ్గా ఇలాంటి సంఘటనే వికారాబాద్ ఎస్పీ ఆఫీసులో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి జిల్లా వ్యాప్తంగా చర్చకు తెరలేపాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. పూడూరు మండల కేంద్రంలో గత ఆదివారం జరిగిన వినాయక నిమజ్జన వేడుకలను పరిశీలించేందుకు వెళ్లిన ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది అప్పటికే ఫుల్లుగా మద్యం తాగి, తమను ఇబ్బందులకు గురి చేశారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. డీజే ఎందుకు పెట్టారని.. రోడ్డుపై నృత్యం చేయొద్దని హెచ్చరిస్తూ.. భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. సహనం కోల్పోయిన గ్రామస్తులు వాహనాల్లోని వినాయకులను రోడ్డుపై దించి నిరసన తెలిపారు. ఈ దృశ్యాలు పలు టీవీ చానళ్లలో ప్రసారం కావడంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న పరిగి సీఐ శ్రీనివాస్ ఎస్‌ఐని మందలించి, పరిస్థితిని చక్కదిద్దారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఎస్‌ఐతోపాటు సిబ్బందిని ఎస్పీ ఆఫీసుకు తీసుకెళ్లి బ్రీత్ అనలైజర్‌తో పరీక్ష చేయించారు. ఈ విషయమై సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా 'ఎస్‌ఐతో పాటు పోలీసులు మద్యం తాగి వచ్చారని మాకు సమాచారం అందిన వెంటనే అక్కడకు చేరుకున్నాం. ఎస్పీ ఆదేశం మేరకు జిల్లా పోలీసు కార్యాలయానికి తీసుకెళ్లి బ్రీత్ ఎనలైజర్‌తో టెస్ట్ చేశాం. ఎవరూ ఆల్కహాల్ తీసుకోలేదని తేలడంతో విధులకు పంపించాం' అని తెలిపారు.

క్లుప్తంగా

డయాగ్నస్టిక్ సెంటర్లు, క్లినిక్‌ల సీజ్



చౌడాపూర్‌లో అనుమతులు లేని వైద్యశాలను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

కుల్కచర్ల: తహసీల్దార్ ప్రభు, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి సమాచారం మేరకు చౌడాపూర్ మండల కేంద్రంలోని పలు డయాగ్నస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లను బుధవారం మధ్యాహ్నం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతు న్న ఎస్‌కే డయాగ్నస్టిక్ సెంటర్, మదీనా డయాగ్నస్టిక్ సెంటర్, మదీనా క్లినిక్, రాజ్యలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, షిఫ క్లినిక్‌లను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల వైద్యాధికారి వాజుద్దీన్, సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్, మెడికల్ అసిస్టెంట్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మ ధ్యాహ్నం సీజ్ చేసిన వీటిని తెరిపించేందుకు సా యంత్రం నుంచే కొందరు ఆర్‌ఎంపీలు పైరవీ లు ప్రారంభించారు. స్థానిక నాయకులకు తీసు కుని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వద్దకు చేరుకున్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు ప్రారంభం

కొడంగల్ రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 68వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంఈఓ రాంరెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 68వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా గురువారం ఉదయం కొడంగల్ పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల ఆవరణలో వాలీబాల్, 20వ తేదీన కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖోఖో, 21న మండల పరిధిలోని రావులపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో కబడ్డీ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

కాకరవేణిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దు

యాలాల: మండల పరిధిలోని కాకరవేణి నది నుంచి యాలాల తహసీల్దార్ ఇస్తున్న ఇసుక అనుమతులు నిలిపివేయాలని పలువురు విశ్వనాథ్‌పూర్ వాసులు బుధవారం తాండూరు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం అందించారు. శివసాగర్ ప్రాజెక్టు దిగువన, గోవిందరావుపేట చెక్‌డ్యాంకు ఎగువన ప్రాంతంలో యాలాల నుంచి పెద్దేముల్ మండలానికి ఇసుక అనుమతులు ఇస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మండలంలో ఇసుక రీచ్ లేనప్పటికీ యాలాల తహసీల్దార్ అనుమతులు జారీ చేయడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టిసారించి అనుమతులు రద్దు చేయాలని కోరారు.

చెట్ల నరికివేతపై ఆగ్రహం

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు నోటీసు



ఎంఈఓకు నోటీసు అందజేస్తున్న సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుభాష్‌పై ఫారెస్ట్ అధికారులు సీరియస్ అయ్యారు. ప్రభుత్వ పాఠశాల్లో 21 చెట్ల నరికివేతపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎఫ్‌ఆర్‌ఓ రాజేందర్ ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్ విచారణ చేపట్టారు. హెచ్‌ఎంపై అటవీచట్టం ప్రకారం పీఓఆర్ కింద కేసు నమోదు చేస్తామని సెక్షన్ అధికారి తెలిపారు. అటవీశాఖ అనుమతి లేకుండా చెట్లు నరికిన హెచ్‌ఎంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎంఈఓ వెంకటయ్యకు నోటీసులు అందించారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. హెచ్‌ఎంతో పాటు కలప విక్రయించిన ఖాదర్‌ఖాన్‌పై సైతం పీఓఆర్ కింద కేసు నమోదు చేస్తామని అధికారి తెలిపారు.

నేడు నాయకులతో సమీక్ష

శంకర్‌పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఓటరు జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు ఉంటుందని, ప్రతి పార్టీ నుంచి నాయకులు హాజరు కావాలని పేర్కొన్నారు.

మూగ రోదన!

- పశువైద్యశాలలో మందుల కరువు
- సకాలంలో వైద్యమందక మృత్యువాత
- ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న పశుపోషకులు



పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ (ఫైల్)

పరిగి: పాడి సంపద పటిష్టానికి కట్టుబడి ఉన్నామన్న ప్రభుత్వ మాటలు నీటి మీద రాతలుగా మారాయి. పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న మూగజీవాలకు సకాలంలో వైద్యమందక మృత్యువాత పడుతున్నాయి. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు అందుబాటులో లేకపోవడం, వైద్య సిబ్బంది కొరతతో పోషకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీంతో ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించి చేతులు కాల్చుకుంటున్నారు. తాము ఇష్టానుసారంగా దోపిడీకి గురవుతున్నామని పాడి రైతులు వాపోతున్నారు.

వైద్యానికే మొత్తం ఖర్చు

ఈ ఫొటో కనిపిస్తున్న వ్యక్తి పేరు విష్ణువర్ధన్‌రెడ్డి. దోమ మండల కేంద్రానికి చెందిన పాడిరైతు. ఆయనకు పది పశువులున్నాయి. అవి ఏదో ఒక వ్యాధితో నిత్యం బాధపడుతుంటాయి. వాటిని ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడ మందులు లేకపోవడంతో ప్రైవేట్ మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పాలపై వచ్చిన ఆదాయం పశువుల వైద్యానికే ఖర్చవుతుందని బోరున విలపిస్తున్నారు.



వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో అధికారుల గణాంకాల ప్రకారం 19 మండలాలల్లో మొత్తం 96 పశు ఆస్పత్రులున్నాయి. అందులో 33 ప్రాథమిక పశువైద్యకేంద్రాలు, 5 ప్రాంతీయ, 58 ఉప పశు వైద్యకేంద్రాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 33 మంది పశువైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 13 మంది మాత్రమే ఉన్నారు. జిల్లాలో 8.5లక్షలకుపైగా పశువులు ఉండగా అందులో ఆవులు 2 లక్షలకు పైగా, గేదెలు లక్షకు పైగా, గొర్రెలు 2.5 లక్షలు, మేకలు 2.5 లక్షలు ఉన్నాయి. ఉండాల్సిన దానికంటే సగం తక్కువగా పశువైద్యులు విధులు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో లేని ఔషధాలు

ప్రభుత్వ పశువైద్యశాలలో మందులు అందుబాటులో లేక పాడి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు ఏదైన రోగం వచ్చిందంటే గతంలో పశువైద్యశాలకు తీసుకెళ్తే వైద్యం అందించేవారు. అక్కడ అనేక రకాల మందులను ప్రభుత్వం సమకూర్చేది. కానీ ప్రస్తుతం పశువైద్యశాలలో తీరు మారింది. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మందులను సరఫరా చేయకపోవడంతో సమస్య మరింత జటిలమైంది.

వైద్యమందక..

గ్రామీణ ప్రాంతాల్లోని పాడిరైతుల పశువులకు సకాలంలో వైద్యమందక మృతి చెందుతున్నాయి. పశువైద్యశాలలకు గత ప్రభుత్వం పంపిణీ చేసిన మందులతోనే ఇన్ని రోజులుగా వైద్యులు కాలాన్ని నెట్టుకుంటూ వచ్చారు. కానీ నేడు మందులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు తప్పని పరిస్థితుల్లో రైతులను ప్రైవేట్‌కు సిఫార్సు చేస్తున్నారు.

అధిక ధరలతో తిప్పలు



ప్రభుత్వం నుంచి మందులు అందించకపోవడంతో ప్రైవేట్‌లో కొనుగోలు చేయలేక పోతున్నాం. దీంతో పశువులకు సరైన చికిత్స అందడం లేదు. ప్రైవేట్‌లో రూ.వేలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం వెంటనే పశువైద్యశాలలకు మందులను పంపిణీ చేయాలి.

– రవికుమార్, పాడి రైతు, మోత్కూర్

నివేదిక పంపించాం



పశువైద్యశాలల్లో మందులు తక్కువగా ఉన్నాయి. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందించాం. త్వరలోనే మందులు వస్తాయి. జిల్లా వ్యాప్తంగా సిబ్బంది కొరత చాలా ఉంది. పశుకేంద్రాల్లో చికిత్సలు అందిస్తున్నాం. ఔషధాలను తీసుకొస్తే పశువులకు చికిత్సలు అందిస్తున్నాం.

– సదానందం, జిల్లా పశువైద్యాధికారి, వికారాబాద్

పొలాల్లో ఫార్మా ఏర్పాటు తగదు

కొనసాగుతున్న భూ బాధితుల దీక్షలు



రిలే నిరాహార దీక్షలో ఫార్మా భూ బాధితులు

దుద్యాల్: పంటలు సాగు చేసే భూమిలో ఫార్మా ఏర్పాటు ఏ మాత్రం సరైన నిర్ణయం కాదని మండలంలోని ఫార్మా భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. 'ఫార్మా వద్దు.. పంటలే ముద్దు' అంటూ హకీంపేట, లగచెర్ల, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచెర్ల తండాలకు చెందిన రైతులు నినాదాలు చేశారు. బుధవారం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బాధిత రైతులు మాట్లాడుతూ.. తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పొలాల్లో ప్రమాదకరమైన ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయడం తగదన్నారు. ఫార్మా కంపెనీ రద్దు చేయకుంటే ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా పోరాటాలు చేపట్టేందుకు సిద్ధమన్నారు. ఫార్మా కంపెనీ రద్దు చేస్తున్నట్లు ప్రకటన జారీ చేసే వరకు దీక్షలు, ధర్నాలు, ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీక్షలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సురేశ్‌రాజ్, మాజీ సర్పంచ్ బసప్ప, రమేశ్‌యాదవ్, పాండునాయక్, కృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.

షరతులు లేని మాఫీ ఇవ్వాలి



ఆందోళనలో రైతులు, ప్రజాసంఘాల నాయకులు

దళిత, ప్రజా సంఘాల డిమాండ్

బొంరాస్‌పేట: ప్రభుత్వం నుంచి రైతులకు అందిస్తున్న రుణమాఫీ పథకంలో ఎలాంటి షరతులు లేకుండా అందజేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రెండు రోజులుగా కొనసాగుతున్న రుణమాఫీ ఆందోళనలో బుధవారం ఎస్‌బీఐ బ్యాంకు, తహసీల్దారు కార్యాలయాల ఎదుట రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. రుణమాఫీ డబ్బులు తమ ఖాతాల్లో వెంటనే జమ చేయాలని, మిగతా వారికి రెన్యూవల్ చేయాలని కోరారు. లేదంటే ఆందోళన విరమించబోమని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, అంబేడ్కర్ సంఘాల తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, ఎమ్మార్పీఎస్ సుభాష్, ఎల్‌హెచ్‌పీఎస్ సూర్యానాయక్, బీవీఎం, కేవీపీఎస్ నాయకులు లక్ష్మయ్య, వెంకటయ్య, బలరాం, వెంకటయ్య పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి దుర్మరణం

- దశ దినకర్మ పూజా సామగ్రిని నీళ్లలో వదులుతుండగా ప్రమాదం
- చెన్నారంలో విషాద ఛాయలు



లక్ష్మప్ప (ఫైల్)

యాలాల: చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన యాలాల మండలం చెన్నారంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ శంకర్, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొనగేరి లక్ష్మప్ప(32) సమీప బంధువు పది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. దశ దినకర్మలో భాగంగా మంగళవారం ఇంటి వద్ద పూజా క్రతువులు నిర్వహించారు. అనంతరం ఇందుకు సంబంధించిన సామగ్రిని చెరువులో వదిలేందుకు వెళ్లిన లక్ష్మప్ప కాలు జారి చెరువులో పడ్డాడు. ఈ సమయంలో అతనితో ఉన్న మరో బాలుడు పరుగున వెళ్లి ఇంటి వద్ద సమాచారం అందించాడు. బంధువులు వచ్చి లక్ష్మప్పను బయటకు తీయగా.. అప్పటికే మృతిచెందాడు. ఈ విషయమై యాలాల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మప్పకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మాజీ సర్పంచ్ మల్లయ్య, సాయిలు, నాయకులు దశరథ్‌రెడ్డి, వడ్ల పెద్ద నర్సింహులుచారి తదితరుల బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

పిల్లలు లేరని మనస్తాపం

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

మోమిన్‌పేట: పిల్లలు లేరని మనస్తాపం చెందిన ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మోమిన్‌పేటలో బుధవారం చోటు చేసుకొంది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వడ్డే మానస(26)కు ఎనిమిదేళ్ల క్రితం ప్రవీణ్‌తో వివాహం చేశారు. వీరికి సంతానం లేదు. దీంతో రెండేళ్ల క్రితం ఆమె భర్తతో గొడవపడి బూర్గుపల్లిలో తన అక్క నర్సమ్మతో ఉంటుంది. పిల్లలు లేరనే క్రమంలో మానసిక మద్యం మత్తుకు బానిసైంది. మంగళవారం రాత్రి ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మరుసటి రోజు ఉదయం గ్రామ సమీపంలోని రాచన్న దేవాలయంలో రేకుల షెడ్డుకు ఉరి వేసుకొని ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి అక్క నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'డబుల్' ధమాకా



ఆవు, రెండు లేగ దూడలతో రైతు ఇస్మయ్య

దోమ: ఒకే ఈతలో రెండు లేగ దూడలకు జన్మించిన సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇస్మయ్య అనే రైతుకు చెందిన ఓ జెర్సీ ఆవు మంగళవారం రాత్రి రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి. ఒకే ఈతలో రెండు దూడలు పుట్టడంపై రైతు సంతోషం వ్యక్తంచేశాడు.

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

మోమిన్‌పేట: అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50వేల పరిహారం రైతులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని చిన్న కోల్కుంద గ్రామంలో సీపీఎం శాఖ మూడో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల అధిక వర్షాలు కురిసి రైతులు సాగు చేసిన పంటలన్ని దెబ్బతిని నష్టపోయారన్నారు. వారికి చేయూతగా ఎకరాకు రూ.50వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వర్షాలకు రోడ్లు పూర్తిగా ధ్వంసం కాగా వాటిని వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మరుగుదొడ్లు, ప్రహరీలు, వంట గదుల నిర్మాణం, మంచి నీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల రుణమాఫీకి ఎలాంటి నిబంధనలు విధించకుండా పూర్తి స్థాయిలో మాఫీ చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి నరేష్, నాయకులు రామయ్య, అశోక్, రాజు, కుమార్, శివ, బాబు, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిలో సర్వే

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో వివాదాస్పద భూమిలో సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన కొత్తూరు సంతోష్‌కుమార్ సర్వేనంబర్ 75లోని అసైన్డ్ భూమిలో తమకు కేటాయించిన నాపరాతి గనిలో కొందరు అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వేయర్ మహేశ్ బుధవారం సర్వే చేపట్టారు. రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు. ఇదివరకే తమకు సంబంధించిన భూమిలో అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.



మల్కాపూర్‌లో సర్వే చేస్తున్న సర్వేయర్ మహేశ్

సందట్లో సడేమియా!

- ప్రభుత్వ భూమిలో ఎర్రమట్టి తవ్వకాలు
- ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా తరలింపు
- ఆ భూమిని సబ్ స్టేషన్ కోసం ఇచ్చామంటున్న రెవెన్యూ అధికారులు
- అందేం లేదంటున్న విద్యుత్ శాఖ అధికారులు

ప్రభుత్వ శాఖల మధ్య నెలకొన్న సమన్వయలోపం అక్రమార్కులకు వరంగా మారింది. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే ఎర్రమట్టి తవ్వకాలు చేపడుతూ కాసులు దండుకుంటున్నారు. రాజకీయ పలుకుబడితో అక్రమ దందా చేస్తున్నారు.

పెద్దేముల్: అధికారగణం అండదండలతో ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెలువెత్తున్నాయి. మండలంలోని కందనెల్లితో పాటు అడ్కిచెర్ల పరిసర ప్రాంతాల్లో రాజకీయ నాయకులు, అధికారుల పలుకుబడితో అక్రమ మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. వెంచర్‌ల పేరుతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా లాభం లేదన్న ఆరోపణలున్నాయి. గతేడాది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి కందనెల్లి గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయించారు. దీనికి సర్వే నంబర్ 240లో ఎకరా ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఈ స్థలంలో విద్యుత్ అధికారులు భూమి పూజ కూడా చేశారు. కానీ సదరు స్థలాన్ని తమకు భూమి కేటాయించలేదని చెబుతున్నారు. సందట్లో సడేమియాలా అక్రమార్కులు సదరు భూమిలో తవ్వకాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు మాత్రం గతేడాదే విద్యుత్ శాఖకు కేటాయించామని వాదిస్తున్నారు.

మాకు కేటాయించలేదు

రెవెన్యూ అధికారులు కందనెల్లి శివారులోని సర్వే నంబర్ 240లో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం భూమిని కేటాయించలేదు. ఒకవేళ కేటాయిస్తే అందులో పనులు ప్రారంభిస్తాం.

– ఆదినారాయణ, ఏడీ, తాండూరు

భూమి అప్పుడే ఇచ్చాం

కందనెల్లి శివారులో గతేడాది సబ్‌స్టేషన్ కోసం విద్యుత్ శాఖకు భూమిని కేటాయించాం. అప్పట్లో భూమి పూజ సైతం చేశారు. ప్రస్తుతం అందులో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం వచ్చింది. కానీ విద్యుత్ అధికారులకే సంబంధం ఉందని చెప్పాం.

– కిషన్, తహసీల్దార్, పెద్దేముల్



కందనెల్లి శివారులో మట్టిని లారీలో నింపుతున్న హిటాచీ

భూ వివాదం.. ఉద్రిక్తం

- ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- డీఎస్పీ కార్యాలయానికి చేరిన పంచాయితీ



ఇరు వర్గాల వాగ్వాదంతో నెలకొన్న ఉద్రిక్తత

తాండూరు: భూ వివాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి.. తాండూరు పట్టణానికి చెందిన ఎంఏ రహమాన్‌కు హైదరాబాద్ మార్గంలోని సాయిపూర్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 5లో నాలుగు ఎకరాలు, మల్‌రెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలోని 51 సర్వేనంబర్‌లో 12.32 ఎకరాల భూమి ఉంది. 1989లో మాజీ మంత్రి చందు మహరాజ్ కుటుంబ సభ్యులకు సర్వేనంబర్ 5లోని 1.37 ఎకరాల భూమిని విక్రయించాడు. అనంతరం చందుమహరాజ్ కుటుంబ సభ్యులు ఈ స్థలాన్ని 23 ప్లాట్లుగా చేసి 25ఏళ్ల క్రితమే విక్రయించారు. ఇదిలా ఉండగా సర్వే నంబర్ 51లో ఉన్న 12.23 ఎకరాల భూమిని సైతం ప్లాట్లుగా చేసి విక్రయించిన రహమాన్ కుటుంబంతో సహా విదేశంలో స్థిరపడ్డారు. సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి రెవెన్యూ గ్రామాల సరిహద్దుల మధ్య ఉన్న 760 చదరపు గజాల భూమి విషయంలో పదేళ్లుగా వివాదం సాగుతోంది. సదరు 760 గజాల స్థలం సర్వే నంబర్ 5లోనే ఉందనే నమ్మకంతో ఇప్పటికే ఈ భూమి ముగ్గురు వ్యక్తుల చేతులు మారి, వారివారి పేరున రిజిస్ట్రేషన్ అయ్యింది. ప్రస్తుతం ఈ స్థలం 2015 నుంచి స్థానిక వ్యాపారి కట్కం వీరేందర్ పేరున ఉంది. ఇందుకు సంబంధించిన అన్ని హక్కులు ఉండటంతో ఇటీవల ఎల్‌ఆర్‌ఎస్ పత్రాలను సిద్ధం చేసుకుని, బుధవారం భూమి పూజ చేశాడు. ఇదిలా ఉండగా సదరు స్థలం మల్‌రెడ్డిపల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 51లోకి వస్తుందని, దీనికి జీపీఏ హోల్డర్‌గా ఉన్న అబ్దుల్ రజాక్ ఉమ్రా యాత్రకు వెళ్లిన సమయం చూసి కట్కం వీరేందర్ స్థలంలోకి చొరబడ్డాడని మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్ ఆరోపించారు. ఈ వివాదంలో ఏడాది క్రితమే తాము కోర్టును ఆశ్రయించగా వీరేందర్‌పై కేసు నమోదైందని తెలిపారు.

వివాదాస్పద స్థలంలో ఉద్రిక్త పరిస్థితి...

వివాదాస్పద స్థలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వీరేందర్‌కు మద్దతుగా స్థానిక వ్యాపారులతో పాటు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్‌లు, నియోజవకర్గంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు చేరుకొని భూమి పూజ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మరో వర్గం యువకులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గొడవ పెద్దదిగా మారే అవకాశం ఉండటంతో మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింహులు ఇరు వర్గాలను తీసుకుని డీఎస్పీని ఆశ్రయించారు. ఇరు వర్గాల వారు తమ వద్ద ఉన్న స్థలం పత్రాలను ఆయనకు అందజేశారు.